పుష్కరాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలి : కలెక్టర్

ఏలూరు: జిల్లాలో గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పుష్కరాలు 2027 జూన్‌లో నిర్వహిస్తారని, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 29 స్నానఘట్టాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. గతం కన్నా రెట్టింపు ప్రజలు స్నానాలు ఆచరించే అవకాశం ఉన్న దృష్ట్యా, అందుకు తగిన విధంగా అదనపు స్నాన ఘట్టాల ఏర్పాటు, పాత స్నాన ఘట్టాల విస్తరణ, దుస్తులు మార్చుకునే గదులు, టాయిలెట్లు, తదితర ఏర్పాట్లపై ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఘాట్ల వారీగా సౌకర్యాలపై ప్రణాళికలు రూపొందించి సమర్పించాలన్నారు. పుష్కరాలు జరిగే గ్రామాల పరిధిలో రోడ్ల నిర్మాణం, సీసీ కెమెరాలు ఏర్పాటు, పారిశుధ్యం, తాగునీరు ఏర్పాట్లకు ముందుగానే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

పోలవరం జిల్లాలో 'పోలవరం' కలపాలని కోరుతూ

ఏజెన్సీ బంద్ విజయవంతం

స్వచ్ఛందంగా వర్తక, వాణిజ్య సంస్థలు మూత

విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలను మూయించిన నిర్వాహకులు

బైక్ ర్యాలీలు, మానవహారాలు, రాస్తారోకోలతో నిరసనలు

బుట్టాయగూడెంలో భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రంపచోడవరం కేంద్రంగా ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని చేర్చాలని డిమాండ్ చేస్తూ జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యాన సోమవారం తలపెట్టిన బంద్ సంపూర్ణంగా ముగిసింది. ఈ సందర్భంగా బుట్టాయగూడెంలో జిల్లా సాధన కమిటీ కార్యదర్శి తెల్లం రామకృష్ణ, నేత మొడియం నాగమణి మాట్లాడారు. ఉదయం నుంచి మండలవ్యాప్తంగా బంద్ ప్రభావం కన్పించింది. ముందస్తు ప్రచారం కారణంగా ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, వర్తక, వాణిజ్య సంస్థలు, దుకాణాలు మూతపడ్డాయి.

రేలా నృత్యాలతో హోరెత్తిన బుట్టాయగూడెం సెంటర్

బంద్ సందర్భంగా బుట్టాయగూడెం సెంటర్‌లో గిరిజనులు సంప్రదాయ నృత్యాలతో నిరసన తెలిపారు. నెహ్రూ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు పోలోజు నాగేశ్వరరావు, పూనెం శేఖర్, వెట్ట మీరయ్య, కారెం ముత్యాలరావు, చుంద్రు బుల్లెమ్మ, కోయిల శ్రీను, కోరం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి



కుక్కునూరు: ఎంఇఒ కార్యాలయాన్ని మూయిస్తున్న నేతలు

పోలవరం: నినదిస్తున్న నేతలు

వేలేరుపాడు: నినదిస్తున్న నేతలు

బుట్టాయగూడెం: విద్యార్థినుల రేలా నృత్యం

వేలేరుపాడు రూరల్: పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని కోరుతూ తలపెట్టిన బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యాన వేలేరుపాడు నుంచి గుళ్లవాయి సెంటర్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో జిల్లా నేత మడివి దుర్గారావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్ముల రమేష్, ఊకె ముత్యాలరావు, సోడె సీతారామయ్య, కారం వెంకట్రావు, మడకం ఏసుబాబు, పొట్ల మోహన్, మిరియాల శ్రీను, కట్టి ఉదయ్ మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన ప్రత్యేక జిల్లా హామీని సంపూర్ణంగా అమలు చేయాలని కోరారు. నియోజకవర్గంలో నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావాలన్నా, ఈ ప్రాంతం అభివృద్ధి కావాలన్నా రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కరాటం ప్రకాష్, కుడియం రాజు, రాంబాబు, ప్రేమకుమార్, కొత్త వెంకటేశ్వర్లు, మల్లేష్, నాగు రాముడు పాల్గొన్నారు.

కుక్కునూరు రూరల్: పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలో ఉన్న మండలాలు లేకపోవడం సిగ్గుచేటని, చంద్రబాబు ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్యామల లక్ష్మణరావు, పట్ల లక్ష్మయ్య, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కురం సంజీవరావు డిమాండ్ చేశారు. సోమవారం పోలవరం సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏజెన్సీ బంద్ మండలంలో విజయవంతమైంది. బంద్ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వర్తక వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంక్, గ్యాస్ గొడౌన్, బ్యాంకులు మూతపడ్డాయి. ఈ సందర్భంగా రామాలయం నుండి ప్రధాన సెంటర్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్లో రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంతోపాటు ఏలూరు జిల్లాలోని టి.నర్సాపురం, గోపాలపురం, కొయ్యలగూడెం మండలాల్లోని గిరిజన గ్రామాలను చేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఈ బంద్‌కు మద్దతు పలికిన సిపిఎం, సిఐటియు, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు, మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు వేణు, గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు కాక ఆనంద్, ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు నవదీప్, లక్ష్మణ్‌కుమార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షులు జెడ్డి రఘు, నాగార్జున, దాచారం సర్పంచి కంటిపల్లి రామకృష్ణ, వర్స లక్ష్మయ్య పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: రంపచోడవరం కేంద్రంగా పోలవరం పేరుతో ఏర్పడే పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని కోరుతూ జెఎసి, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మన్యం బంద్ విజయవంతమైంది. ఈ బంద్‌కు సిపిఎం, సిఐటియుతోపాటు ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. బంద్ కారణంగా ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. వ్యాపార, వర్తక దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. స్థానిక జగదాంబ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలోని మండలాలు లేకపోవడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. తద్వారా నిర్వాసితులు, ఆదివాసీలు, ఈ ప్రాంత అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న నిర్వాసితులకు సైతం జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో పునరావాసం కల్పిస్తున్నారని, ఇప్పుడు పోలవరం జిల్లాలోని పోలవరం నియోజకవర్గం లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, అలాగే పోలవరం ఎంఎల్ఎ దీనిపై గట్టి కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో మరింత ఉధృతంగా ఉద్యమాలు సాగిస్తామని ప్రకటించారు. కార్యక్రమానికి రైతుసంఘం నేత సిరిబత్తుల సీతారామయ్య అధ్యక్షత వహించగా, సిఐటియు మండల కార్యదర్శి చిట్టిబొమ్మ కొండలరావు, వ్యవసాయ కార్మిక సంఘం నేత కారం నాగదుర్గ, ఐద్వా నేత నేలటూరు నిర్మల, సంఘాల నేతలు తెల్లం శంకరుడు గుండే గంగరాజు, ఎన్.అప్పారావు, కలపాల జగదీష్, దాసరి రామారావు, నరసింహ, బేతి లక్ష్మీ ప్రభాకర్ పాల్గొన్నారు.



టి.నరసాపురం: ఫ్లకార్డులతో నిరసన

టి.నర్సాపురం: మండలంలోని 18 గిరిజన గ్రామాలను పోలవరం జిల్లాలో కలపాలని సిపిఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఏజెన్సీ బంద్‌లో భాగంగా సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో టి.నరసాపురంలోని గిరిజన గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం వద్ద మల్లప్పగూడెంలో ధర్నా నిర్వహించారు. మండలంలోని 18 గ్రామాలు కూడా షెడ్యూల్డ్ ప్రాంతంలో కలపాలని, ఏజెన్సీ హక్కులు కల్పించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు బలగడ కుమారి, మడకం కుమారి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో నినదిస్తున్న వామపక్ష నేతలు, కార్యకర్తలు

'ఉపాధి హామీ' యధాతథంగా అమలు చేయాలి

వామపక్షాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని, కేంద్రం తీసుకొచ్చిన వికసిత్ భారత్ జి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జి రామ్ జి పథకానికి వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.గౌస్, న్యూ డెమోక్రసీ నగర నాయకులు కాకి నాని, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం మతం ముసుగులో జీ రాంజీ పథకంగా మార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేని సమయంలో పేదలకు వలసలను నివారిస్తూ ఉపాధి కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం గత 11 ఏళ్లుగా నీరుగార్చడానికి ప్రయత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే మహాత్మాగాంధీని హత్య చేసిన గాడ్సే పేరుతో వికసిత్ భారత్ జీ రాంజీ పథకంగా పేరు మార్చి కేంద్రం వాటా 90 శాతం నుంచి 60 శాతానికి కుదించిందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని రానున్న రోజుల్లో రద్దు చేసే ఆలోచనతోనే కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రం వాటా పది శాతం నుంచి 40 శాతానికి పెంచడాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాలని, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం ద్వారానే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కేంద్రం తీరుపై వామపక్షాలతోపాటు కలిసొచ్చే పార్టీలను, సంఘాలను కలుపుకుని ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు ఎస్‌కె.మున్ని, రెడ్డి శ్రీనివాస్ డాంగే, పుప్పాల కన్నబాబు, కురెళ్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదు

అర్జీదారుల సంతృప్తే కీలకం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

పిజిఆర్‌ఎస్ అర్జీలు 352



సమస్యలు వింటున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో ఆమె నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్ ఎల్.దేవకిదేవి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్‌పై ప్రతివారం సిఎం సమీక్షిస్తున్నారన్నారు. ఒకే ఫిర్యాదు రెండుసార్లు ఎందుకు వస్తున్నాయని ఒకటికి నాలుగుసార్లు పరిశీలించి, పరిష్కారం కానివి జిల్లా యంత్రాంగానికి తెలపాలన్నారు. రెవెన్యూ సర్వీసులు, సర్వే, పిజిఆర్‌ఎస్ సమస్యల పరిష్కారంపై ఫిర్యాదుదారుల సంతృప్తిస్థాయి తక్కువగా ఉందన్నారు. ఈ రోజు పిజిఆర్‌ఎస్‌లో 352 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్‌వి.నాంచారయ్య, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెంచాలి

జిల్లా సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించిన కలెక్టర్

ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు

విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచి భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్)ను ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య(చంటి)తో కలిసి ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచాలన్నారు. వారిలో శాస్త్రీయ ఆలోచనా శక్తిని, నూతన ఆవిష్కరణలు చేసే సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. అందరు విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లనే కాకుండా శాస్త్రవేత్తలుగా కూడా అభివృద్ధి చెందాలన్నారు. నూతన ఆవిష్కరణల్లో జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయికి వెళ్లేలా చూడాలన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ రేపటి పౌరుల్ని ప్రతిభ గల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి దిశగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శనలు, విద్యార్థుల ప్రతిభను చూసి వారిని కలెక్టర్, ఎంఎల్ఎ అభినందించారు. కార్యక్రమంలో డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ప్రముఖులు చోడే వెంకటరత్నం, రెడ్డి తిరుపతిరావు పాల్గొన్నారు.

సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

డిసిసిబి వద్ద ధర్నాలో సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్

ధర్నాలో అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే రానున్న కాలంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహించాల్సి వస్తుందని సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ హెచ్చరించారు. ఎపి రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక (జెఎసి) పిలుపులో భాగంగా సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ సహకార రంగంలో రైతులకు, ప్రజలకు సేవలందిస్తున్న సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు పెద్దసంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు. సొసైటీ ఉద్యోగులకు జిఒ నెం.36 అమలు చేయాలని, వేతన సవరణ వెంటనే చేయాలని, గ్రాట్యూటీ చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, సొసైటీల ప్రయివేటీకరణ ఆలోచన విరమించుకోవాలని, సిబ్బందిని కుదించే ఆలోచన మానుకోవాలని నినదించారు. ఉమ్మడి జిల్లా యూనియన్ నాయకులు కెవివి.సత్యనారాయణ, టి.గంగరాజు, కృష్ణశాస్త్రి, పెద్దిరాజు, రామచంద్రరావు, ప్రసాదరావు, సిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2019లో జారీ చేసిన జిఒ నెం.36ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసిసిబి, ఆప్కాబ్ తమ వంతు నిధులు సమకూర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎసిఎస్‌లకు డివిడెంట్లు ఇవ్వకుండా, సిబ్బంది వేతనాల ఖర్చులో తమ వాటాలు భరించకుండా డిసిసిబి, ఆప్కాబ్ కాలక్షేపం చేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 2019, 2024 వేతన సవరణ వెంటనే చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత చేరిన వారిని క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం చేసిన సవరణలను టిడిపి అధికారంలోకి వచ్చినా రద్దు చేయకుండా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని విమర్శించారు. సిఐటియు నాయకులు సిహెచ్.సుందరయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార సంఘాల వ్యవస్థను ప్రయివేటుపరం చేసేందుకు మోడీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రయత్నిస్తోందని, ఆ విధానాలనే రాష్ట్రంలో అధికారంలో ఉన్నవారూ అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులందరికీ చట్టప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని కోరారు. సంఘాల్లో సిబ్బందిని కుదించే ఆలోచనలను ప్రభుత్వాలు మానుకోవాలని హితవు పలికారు. సంఘాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పే ప్రయత్నాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం డిసిసిబి జిల్లా మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు సుబ్బారావు, వీరయ్య, రాధాకృష్ణ, సర్వేశ్వరరావు, వలీ, అమర్నాథ్ నాయకత్వం వహించారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన అవసరం

జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ

ప్రజాశక్తి - ఏలూరు

విద్యుత్ పొదుపుపై విద్యార్థిస్థాయి నుండే అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ చెప్పారు. ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జెసి అభిషేక్ గౌడ మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యుత్, ఇంధన పొదుపుపై జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పి.సాల్మన్‌రాజు, పర్యవేక్షక ఇంజినీర్ టి.శశిధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, టెక్నికల్ టి.రాజ్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సంజయ్‌కుమార్, ఇ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందిస్తున్న జెసి

పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలి

ఐజి అశోక్‌కుమార్

మాట్లాడుతున్న ఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు శాఖలో ఉద్యోగం సాధించడం ప్రస్తుతం అతి కష్టమైన పనిగానే ఉందని, కష్టాన్ని ఓర్చుకుని ఉద్యోగం సంపాదించిన ప్రతిఒక్కరూ శాఖకు మంచి పేరు తెచ్చే విధంగా విధి నిర్వహణ చేయాలని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్ కుమార్ అన్నారు. జిల్లాలోని పెదవేగి జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్లో నూతనంగా ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులు శిక్షణకు చిత్తూరు జిల్లా నుండి వచ్చారు. వీరిని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ ఇక్కడ తొమ్మిది నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ పోలీసు విధుల్లో చేరాక ఎంతో కష్టాన్ని ఓర్చి విధులను నిర్వహించాలని గుర్తు చేశారు. వరదలు, తుపాన్లు వంటివి లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించే ఒకే ఒక్క శాఖ పోలీసు శాఖ అని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ శిక్షణలో నేర్పిస్తామన్నారు. సేవాభావం, అంకిత భావంతో ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలన్నారు. జిల్లా ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు మాట్లాడారు. కార్యక్రమంలో పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి రవిచంద్ర, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, డిటిసి సిఐ రామారావు, రఘు, ఏలూరు త్రీటౌన్ సిఐ కోటేశ్వరరావు, కైకలూరు సిఐ రామకృష్ణ, జంగారెడ్డిగూడెం సిఐ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవికి నంది అవార్డు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవికి హైదరాబాద్ రితిక ఫౌండేషన్ ప్రతినిధులు నంది అవార్డును అందించి సత్కరించారు. ద్వారకాతిరుమలలో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు నిత్యానందచారి ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్ఎ మురళి, ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ సత్యంబాబు అవార్డును అందించారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటం, కుమార్తె వైష్ణవికి సహకరిస్తున్నందుకు ఆమె తండ్రి డాక్టర్ మనోజ్‌కు బెస్ట్ సోషల్ వర్క్ అవార్డు అందించారు. ఈ సందర్భంగా నంది అవార్డు అందుకున్న వైష్ణవిని పలువురు ప్రముఖులు అభినందించారు.



నంది అవార్డును అందుకుంటున్న వైష్ణవి

సిఐటియు మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి ఉంగుటూరు

ఈ నెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభను జయప్రదం చేయాలని ఉంగుటూరు మండల కన్వీనర్ సీరా అప్పారావు కోరారు. ఈ మేరకు చలో విశాఖ వాల్‌పోస్టర్లను సోమవారం గ్రామ గ్రామాన అంటించారు. ఈ కార్యక్రమంలో ముళ్లపాక లింగ సూర్యనారాయణ, పూడి అబ్బులు, నాగరాజు, బాపిరాజు, బి.శ్రీను పాల్గొన్నారు.

జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో ఏలూరు, దెందులూరులో ఉన్న జిల్లా మీడియా ప్రతినిధులు, జర్నలిస్టులు, వీడియో ఫొటో జర్నలిస్టులకు ఆశ్రం హాస్పిటల్స్ వారు ఆ ఆసుపత్రిలో ఉచిత వైద్య సదుపాయానికి సంబంధించి హెల్త్ కార్డులను అందించే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి, టిడిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబాలకు ఆశ్రం వారు అందించే హెల్త్ కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్డుల ద్వారా సుమారు 250 జర్నలిస్టుల కుటుంబాలకు ఉపయోగం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రం హాస్పిటల్స్ డైరెక్టర్ రవిదేవి, సిఇఒ డాక్టర్ హనుమంతరావు, ఎపియుడబ్ల్యుజె నాయకులు, రిపోర్టర్లు, కెమెరామెన్లు పాల్గొన్నారు.



హెల్త్ కార్డు నమూనా అందిస్తున్న మంత్రి పార్థసారధి

కొత్త పైడిపాకను పంచాయతీగా చేయాలని వినతి

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పైడిపాకను పంచాయతీగా ఏర్పాటు చేయాలని లేదా పోలవరం పంచాయతీలో కలపాలని కొత్తపైడిపాక నవచైతన్య అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షుడు ఈర్ల జాన్‌బాబు, ఉపాధ్యక్షుడు గండి రాజేష్ డిమాండ్ చేశారు. పోలవరం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో తహశీల్దార్ బి.సాయిరాజు, ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు, ఎ.ఎల్.సత్యనారాయణలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈర్ల జాన్‌బాబు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో పైడిపాకను ముంపు గ్రామంగా ఖాళీ చేయించి, పునరావాస గ్రామం కొత్తపైడిపాక తరలించారన్నారు. పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి పాతపైడిపాక పంచాయతీగా ఉండేదన్నారు. గ్రామాన్ని ఖాళీ చేయించి పోలవరం మండలం, పోలవరం గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పునరావాస గ్రామం కొత్తపైడిపాక తరలించారన్నారు. అన్ని అర్హతలు కలిగిన కొత్తపైడిపాక పంచాయతీగా ఏర్పాటు చేయాలని, లేదా పోలవరం పంచాయతీలో కలపాలని, లేకపోతే ఉద్యమం చేస్తామని తెలిపారు.

సీసీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నిడమర్రు మండలం పెద నిండ్రకొలనులో శివాలయం - మంచిలిచెరువు- విద్యుత్ ఉపకేంద్రం రోడ్డుతో పాటు ప్రధాన సీసీ రోడ్డు విస్తరణ పనులు సోమవారం ప్రారంభించారు. జన సంచారం రద్దీగా ఉండే ప్రధాన రోడ్డుతో పాటు శివ రాత్రి సందర్భంగా ప్రతి ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రథోత్సవానికి ఇరుకు రోడ్డుతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జనసేన నాయకుడు వంగా రఘు, చింతలపాటి బాసిరాజు కృషితో నిధులు మంజూరు చేయించారు. ఈ క్రమంలో సిమెంట్ రోడ్డు విస్తరణ పనులకు డిఇ వేబంగీపాల్ మార్కండేయ ఇన్‌ఛార్జ్ పనులకు వంగా రఘు, బాసిరాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కాంట్రాక్టర్ అక్కిన శేషు పనులు చేపట్టారు. వీటితో పాటు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరైనట్లు రఘు వెల్లడించారు. ఇరుకుగా ఉండే సీసీ రోడ్డును విస్తరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాభివృద్ధికి నిధుల మంజూరు గర్వకారణం

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాభివృద్ధికి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ నిధులు మంజూరు చేయడం గర్వకారణమని ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కొండేటి బాబి, టిడిపి యువజన నాయకులు బి.రంగారావు అన్నారు. ముసునూరు శ్మశానవాటిక వద్ద వారు సోమవారం విలేకర్లతో మాట్లాడారు. గత 90 ఏళ్ల నుంచి ముసునూరు శ్మశానవాటికలో మౌలిక వసతులు లేక ముళ్ల పొదలు, తుప్పలు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని మంత్రి పార్థసారధి దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లగా వెంటనే ఆయన స్పందించి ఏలూరు ఎంపీ మహేశ్‌కుమార్ ద్వారా పార్లమెంటు నిధులు రూ.20 లక్షలు మంజూరు చేయించారన్నారు. అధికారులు సోమవారం శ్మశానవాటికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి తోట శ్రీను, పల్లి గ్రామ అధ్యక్షులు గర్లపాటి నరసింహారావు, బిజెపి నాయకులు నక్క యోహాన్, కొండబోయిన నాగు, గ్రామస్తులు చెన్ను సత్యం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేతలు

శ్మశానవాటిక ఏర్పాటుకు నిధులు మంజూరు

ముసునూరు : వలసపల్లి శ్మశాన వాటిక ఏర్పాటుకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ రూ. 20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు టిడిపి గ్రామ అధ్యక్షులు మెదరమెట్ల సురేంద్ర తెలిపారు. వలసపల్లి గ్రామ సర్పంచి చలసాని దామోదరరావు, గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. హిందూ శ్మశానవాటిక సమస్యను మంత్రి పార్థసారధి దృష్టికి తీసుకెళ్లగా ఆయన రెవెన్యూ అధికారుల ద్వారా 50 సెంట్ల స్థలాన్ని కేటాయించి, అందులో ఉన్న తుప్పలను సొంత నిధులతో పొక్లెయిన్ ద్వారా శుభ్రం చేయించారని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

సున్నంపూడి విషాద ఘటనలో మరొకరు మృతి

ప్రజాశక్తి - కలిదిండి

సున్నంపూడి విషాద ఘటనలో మరొకరు మృతి చెందారు. సున్నంపూడికి చెందిన ఆరుగురు ఆదివారం చేపల పట్టుబడి కోసం బొలెరో వాహనంలో వెళ్లగా ఆ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తిరుమలశెట్టి ఆంజనేయులు (48), కొల్లి వెంకటేశ్వరరావు(49) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలుకాగా వారిలో ఆంజనేయులు కుమారుడు వెంకటకృష్ణ (18) పరిస్థితి విషమంగా ఉండడంతో ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వెంకటకృష్ణ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తండ్రి ఆర్థిక పరిస్థితికి తోడుగా చేపల పట్టుబడికి వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. ఒకరోజు భర్త, మరుసటి రోజు కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. ఆమె బాధ వర్ణనాతీతం. సున్నంపూడిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఉపాధి హామీ చట్ట సవరణ తగదు

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేలా దాని పేరు మార్చడంతోపాటు నిబంధనలు మార్చడం పేదల పొట్ట కొట్టడమేనని సిపిఎం నేత సత్తు కోటేశ్వరరావు విమర్శించారు. ఉపాధి హామీ చట్ట సవరణను నిరసిస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో చిన్నాగిరిపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ జహంగీర్‌భాషా, తాడి అర్జునరావు, జంగం రంగారావు, ఎం.కవిత, జె.మరియమ్మ, బొంతు మోహనరావు, షేక్ భాషా, ఎం.స్టాలిన్ పాల్గొన్నారు.

చింతలపూడి : వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చింతలపూడి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు అధ్యక్షత వహించగా సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు మాట్లాడారు. వామపక్ష పార్టీల పోరాట ఫలితంగా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు తలారి ప్రకాష్, ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు

ఆగిరిపల్లిలో...

కంచర్ల గురవయ్య, మండల కార్యదర్శి ముల్లగిరి లాజరు, ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ తొర్లపాటి రాజు, సిపిఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : ముసునూరు మండపం సెంటర్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కంచర్ల దుర్గారావు, పార్టీ మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, కంచర్ల భాష, కంచర్ల శ్రీను, కంచర్ల వంశీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని పల్లెర్లమూడి, సీతారాంపురం, మీర్జాపురం గ్రామాల్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బోసు, సిపిఎం నాయకులు ప్రసాద్, ఏసుబాబు, అనిల్, సునీల్, సుబ్రహ్మణ్యం, సమూయేలు, తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : రామవరం ప్రధాన రహదారి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము, రామవరం సర్పంచి పిట్టా ప్రసాద్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మడివి కామయ్య, బంధం పెద్ద నాగేశ్వరరావు, సోందే నాగరాజు, పిట్టా ముత్యాలరావు, మడకం దేశమ్మ, బంధం రమాదేవి, చుక్కమ్మ, బంధం సాయమ్మ, పిట్టా చంద్రావతి, గంగాదేవి, బంధం అర్జున్, పిట్టావీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు నిరసన

పోలవరం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బదులుగా బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఆఫ్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్‌ను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీ మంగళవారం పోలవరంలో నిర్వహించే రైతు కూలీల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) పిలుపునిచ్చింది. ఈ మేరకు సంఘం జిల్లా కార్యదర్శి షేక్ భాషా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ముసునూరు : వ్యవసాయ కార్మిక సంఘం కూలీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బుడుపుల జయశ్రీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంపిడిఒ పి.ఏసుబాబుకు వినతిపత్రం అందించారు.

ఏలూరును బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

బాలల సంరక్షణ జిల్లా అధికారి సూర్యచక్రవేణి

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరును బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, దీనిలో ప్రజలతో పాటు, అధికార యంత్రాంగం సైతం భాగస్వాములు కావాలని బాలల సంరక్షణ జిల్లా అధికారి సూర్యచక్రవేణి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో వచ్చే సంవత్సరం మార్చి నెల ఎనిమిదో తేదీతో ముగిసే వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యచక్ర వేణి హాజరయ్యారు. కార్యక్రమానికి భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవితో పాటు, తహశీల్దార్ రమాదేవి అధ్యక్షత వహించారు. ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ పరిధిలోని క్లస్టర్ పర్యవేక్షకులు రూపాదేవి, నూర్జహాన్ సహకరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సూర్య చక్రవేణి బాల్య వివాహాల సమాచారం అందించాలని కోరారు. ఎంపిడిఒ మాట్లాడుతూ సామాజిక దురాచారంగా బాల్య వివాహాలను అభివర్ణించారు. వీటిని నిరోధానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తారని హామీ ఇచ్చారు. తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో బాల్య వివాహాలు అరికట్టే కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంబరుపేట గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, స్వచ్ఛంద సంస్థ క్రాఫ్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని తుక్కులూరు, జంగంగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లు, జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటి ట్యాంకు నిర్మాణ పనులకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. టిడిపి ముసునూరు మండలాధ్యక్షుడు రఘు, ఆది, గణేష్, ప్రసాద్, అశోక్, రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తూటిగుంట పంచాయతీ ఏర్పాటు కోరుతూ వినతి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన గిరిజన నిర్వాసిత గ్రామాలవారికి, పునరావాసాలుగా కేటాయించిన గ్రామాలన్నింటిని కలిపి తూటిగుంట గిరిజన పంచాయతీని ఏర్పాటు చేయాలని ఆదివాసీ మహాసభ అధ్యక్షుడు మిడియం వెంకటస్వామి డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబుకు ఆయా గ్రామాల గిరిజనులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మిడియం వెంకటస్వామి మాట్లాడుతూ పోలవరం మండలం పోలవరం ప్రాజెక్టులో ముంపు గ్రామాలైన పైడాకులమామిడి, తూటిగుంట, పల్లపూరు, ములగలగూడెం, తల్లవరం నిర్వాసిత గిరిజన గ్రామాల వారికి బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలో పునరావాస గ్రామాలను కేటాయించారన్నారు. ఈ గిరిజన గ్రామాలన్నింటిని గిరిజనేతర పంచాయతీ అయిన రెడ్డిగణపవరంలో కలపాలని అధికారుల సన్నాహాలు చేస్తున్నారన్నారు. గిరిజనులను గిరిజనేతర పంచాయతీలో కలపడం వల్ల గిరిజన అభివృద్ధి కుంటుపడుతుందని, రాజకీయంగా సామాజికంగా వెనకబడిపోతామని భయాం దోళనలు వ్యక్తం చేశారు. అందరిని కలిపి తూటిగుంట పంచాయతీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

విజయ ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక విజయ ఫార్మసీ కాలేజీలో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కొత్తూరు వేణుగోపాలకృష్ణుడు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా భవిష్యత్తు ప్రణాళికలను విద్యార్థులు రూపొందించుకోవాలన్నారు. డైరెక్టర్ అడుసుమిల్లి తనూజ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలను చేరుకోగలరని, ఫార్మసీ రంగంలో మరిన్ని ఉపాధి అవకాశాలు పెరుగుతున్నందున అందుకు తగిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొగిలి రామ కోటయ్య మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, కృషి చాలా అవసరమని, అదేవిధంగా ఫార్మసీ రంగంలో, ఔషధాల తయారీలో ప్రపంచంలోనే భారత దేశం కీలక పాత్ర వహిస్తుందని, ఈ రంగంలో నైపుణ్యాలు ఉంటే విజయ అవకాశాలను సులువుగా అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్ వినయ్‌కుమార్ ఫార్మసీ కోర్సు ప్రాధాన్యతను, మెళకువలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు డైరెక్టర్లు, కరెస్పాండెంట్, ప్రిన్సిపల్ చేతులమీదుగా జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ కృష్ణుడు

ఆర్‌జియుకెటిలో మ్యాథ్స్ మేనియా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటిలో గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మ్యాథ్ మేనియా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థకు చెందిన గణితశాస్త్ర విభాగ ప్రొఫెసర్ ఎ.బెనర్జీ బాబు హాజరయ్యారు. ఆయన ప్రసంగంతో అనేక మంది విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి లక్ష్మణరావు, విద్యా విభాగ డీన్ సాదు చిరంజీవి, బాలల సంక్షేమాధికారి డాక్టర్ లంకపల్లి రాజేష్, బాలికల సంక్షేమాధికారి డాక్టర్ టి.దుర్గాభవాని, సహాయ డీన్‌లు జి.భరత్, దుర్గాబాబు, రఘు కుమార్, అన్ని విభాగాల అధిపతులు, గణితశాస్త్ర విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమం గణితశాస్త్ర విభాగాధిపతి జాజుల మధు పర్యవేక్షణలో విజయవంతంగా ముగిసింది.

విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షులుగా కిషోర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నిక సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగింది. మండల విఆర్‌ఒల సంఘం నూతన అధ్యక్షులుగా చిగురుకోట విఆర్‌ఒ కె.కిషోర్, ఉపాధ్యక్షులుగా అల్లూరు విఆర్‌ఒ టి.శ్రీరాములు, కోశాధికారిగా పెదపాలపర్రు విఆర్‌ఒ టివిఆర్ శ్యామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన మండల విఆర్‌ఒల సంఘం కార్యవర్గ సభ్యులను తహశీల్దార్ షేక్ లతీఫ్ పాషా, ఆర్ఐ రాజశేఖర్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.



కిషోర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రముఖులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన

ప్రజాశక్తి - ముసునూరు

వైద్య శాఖాధికారులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొండా దుర్గాభవాని, ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు, డిప్యూటీ ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.చాముండేశ్వరి మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో భాగంగా వరి పంట తొమ్మిది వేల మెట్రిక్ టన్నులు లోడింగ్ చేసి, రైతుల ఖాతాలో రూ.20.14 కోట్ల నగదు జమ చేశారని, ప్రస్తుతం రబీ సీజన్‌లో 4339 ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న పంట రైతులు సాగు చేస్తున్నారన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ ఎఇ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మండలంలోని 16 గ్రామాల్లో రూ.ఐదు కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో అపార్ ఐడి కోసం ప్రతి విద్యార్థి ఆధార్ సెంటర్ కోసం పలు ఇబ్బందులు ఎదుర్కొగా, చెక్కపల్లి సచివాలయం ప్రభుత్వం ఆధార సెంటర్ ఎంపిడిఒ ద్వారా ఏర్పాటు చేశారని, ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులు 422 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, 75 మంది ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరవుతున్నట్లుగా తెలిపారు. రమణక్కపేట పిహెచ్‌సి వైద్యులు ప్రజ్ఞ మాట్లాడుతూ రమణక్కపేట పిహెచ్‌సి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉందన్నారు. వెలుగు ఎపిఎం కె.రాంబాబు మాట్లాడుతూ గతంలో డ్వాక్రా సభ్యులు రుణాలు 24 నెలలు కాగా, ప్రస్తుతం ప్రభుత్వం 36 నెలలకు పొడిగించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.పురుషోత్తమ శర్మ, జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవా కార్యక్రమాలు అభినందనీయం

భీమడోలు : మనిషి చావు తర్వాత నిర్వహించే అంత్యక్రియల ఖర్చు పెరగటంతో స్వచ్ఛంద సంస్థ భీమడోలు మానవతా శాఖ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించేందుకు స్టీల్‌తో తయారుచేసిన పాడెను అవసరాలమేరకు ఉచితంగా ఇచ్చేందుకు సిద్ధం చేసింది. దీనికి అవసరమైన ఖర్చు రూ.12 వేలను దుద్దేపూడి గ్రామ సర్పంచి నీలం శ్రీనివాసరావు సమకూర్చారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో స్థానిక మానవతా శాఖ సభ్యులకు దానిని అప్పగించారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా కన్వీనర్ రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ దుద్దేపూడి గ్రామ ప్రజల అవసరార్థం శవశీతలీకరణ బాక్స్‌ను సమకూర్చేందుకు దాతలు, సంస్థ సిద్ధమయ్యారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు కొందరు అంత్యక్రియల సందర్భంగా మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించేందుకు అవసరమైన పాడె తయారీకి రూ.మూడు వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. వాతావరణం సహకరించకుంటే ఈ ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామంలో శవశీతలీకరణ యంత్రాన్ని భద్రపరిచేందుకు స్థలాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రెడీమేడ్ పాడెను సమకూర్చాలని గ్రామస్తులు కొందరు కోరారు. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచి స్పందించి రెడీమేడ్ పాడెను అందించారని తెలిపారు. ఇదే క్రమంలో మృతదేహాలను గోదావరి ఒడ్డున ఉన్న కొవ్వూరుకు తరలించేందుకు మృతుల కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు సహకరించేందుకు మానవత సంస్థ శాంతిరథం కార్యక్రమం పేర ఉచితంగా రవాణా సౌకర్యాన్ని ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులో ఉంచిందన్నారు.

నాణ్యమైన విద్యా బోధనతోనే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాణ్యమైన విద్యా బోధన ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జివిఎన్ఆర్ విద్యా సంస్థ నిరూపిస్తోందని ఎస్ఐ ఎం.జయబాబు అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో జివిఎన్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యా సంస్థల ఛైర్మన్ ఘంటా వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ ఎం.జయబాబు చేతులమీదుగా గతేడాది మండల స్థాయిగా ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి, స్కూలు స్థాయిలో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థుల తల్లిదండ్రులకు మెమెంటోలు ఇచ్చి సన్మానించారు. అనంతరం ఎస్ఐ జయబాబును కూడా స్కూల్ ఛైర్మన్ శ్రీనివాసరావు దంపతులు, తల్లిదండ్రులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మంచి విలువలు నేర్పాలన్నారు. కష్టపడి చదవి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు జివిఎన్ఆర్ విద్యాలయ సంస్థ చేపడుతున్న విధానాలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

కేశరి సునీత, భర్త: శ్రీను, డోర్ నెం. 8-45A, తిమ్మారావుగూడెం గ్రామం, చాటపర్రు పోస్ట్, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా నా పాస్‌పోర్ట్ నెం.N2431036 గల నెంబర్ పాస్‌పోర్ట్ తేది.05.12.2025 వ తేదిన మా ఇంటి నుండి బైక్ పై వెళ్తుండగా చాటపర్రు సెంటర్‌లో పడిపోయినది. ఎంత వెతికినా కనబడలేదు. దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు తెలియజేయగలరు.

సంప్రదించండి: 90596 62766

ప్రగడవరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ప్రగడవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికవ్వడం అభినందనీయమని చింతలపూడి ఎంఇఒ కిరణ్‌బాబు తెలిపారు .జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్ర స్థాయికి పి.రేవతి, వరలక్ష్మి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

ఆదాయ వనరులు పెంచేందుకు శిక్షణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామ పంచాయతీలు ఆస్తి పన్ను, నీటి పన్ను, దుకాణాల అద్దెలు, మార్కెట్ రుసుములు, భవన నిర్మాణ అనుమతుల ఫీజులు, లైసెన్సుల ద్వారా ఆదాయ వనరులుగా సంపాదించవచ్చని ఉంగుటూరు ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్ అన్నారు. పంచాయతీలకు ఆదాయ వనరులపెంపుపై పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ సోమవారం ఉంగుటూరులో నిర్వహించారు. పంచాయతీలు ప్రభుత్వ నిధుల కోసం వేచి చూడకుండా ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగడానికి ఆదనపు ఆదాయ వనరుల మార్గాలను వెతకాలని కోరారు. డిప్యూటీ ఎంపిడిఒలు ముత్తయ్య, గెడ్డం రమేష్‌బాబు, రిసోర్స్ పర్సన్ జివి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమడోలు : గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరుల పెంపు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిధిలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, ఇంజినీరింగ్ సహాయకులు ఇతరులకు సొంత ఆదాయ వనరుల పెంపు, స్వమిత్వ కార్యక్రమాల అమలుపై ఒకరోజు పాటు తరగతులను సోమవారం నిర్వహించారు. కార్యక్రమాలకు అంశపు కన్వీనర్‌గా ఎంపిడిఒ వ్యవహరించారు. సహాయ కన్వీనర్లుగా డిప్యూటీ ఎంపిడిఒలు సుబ్బారావు, ఫణీంద్రనాథ్ వ్యవహరించగా, మాస్టర్ ట్రైనీగా అంబరుపేట గ్రామపంచాయతీ కార్యదర్శి శిక్షణా తరగతులను నిర్వహించారు.

దస్తావేజు పోయినది

పాలకొల్లు పట్టణం కాపురస్తులు పితాని తులసి, భర్త: చిన్ని, డోర్ నెంబర్ 17-06-09, రాజీవ్ నగర్, 10వ వార్డు ఇచ్చిన పత్రిక ప్రకటన ఏమనగా నా తాలూకు పాలకొల్లు పట్టణంలోని టీఎస్ నెంబర్ 872/6, 872/5 లు దాఖలా ప్లాట్ నెంబర్ 30కు చదరపు గజాలు 161.11 స్థలము తాలూకు దస్తావేజు నెంబర్ 66/2012 గల ఒరిజినల్ దస్తావేజు ది.15-10-2025న పట్నంలోని జెరాక్స్ తీయించడానికి మెయిన్ రోడ్డుకు తీసుకుని వెళుతుండగా దారి మధ్యలో ఒరిజినల్ దస్తావేజులు, లింక్ డాక్యుమెంట్‌లు పడిపోయినవి. దారంతా ఎంత వెతికినా నా ఒరిజినల్ దస్తావేజు దొరకలేదు . ఎవరికైనా దొరికిన ఈ కింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు.

సెల్ 9542066064

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం పెనుగొండ గ్రామానికి చెందిన గుడాల దుర్గారావు : తండ్రి నాగరాజు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. వెంద్ర వారి వీధి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయింది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : L9917824 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

గుడాల దుర్గారావు, తండ్రి : నాగరాజు
కరెంట్ ఆఫీస్ దగ్గర, దేవి రోడ్, పెనుగొండ
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా.
ఫిన్ : 534320, సెల్ : 8985147568

మహారాజశ్రీ ఏలూరు అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎక్సైజ్ మెజిస్ట్రేట్

ఒ.యస్.నెం.85/2025

బిట్వీన్ :
వై.లక్ష్మి దుర్గ ...వాది
Vs
ఎ.నాగేశ్వరరావు & అనదర్ ...ప్రతివాదులు

D1 : అన్నపురెడ్డి నాగేశ్వరరావు,
తండ్రి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఎంప్లాయి,
డో.నెం.11-91, వట్లూరు, పెదపాడు
మండలం-534007, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావా యందు మొదటి ప్రతివాదికి నోటీసు నిమిత్తం ది.24-12-2025 వాయిదా అయి ఉన్నది. పై తేదీన ఉదయం 10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలున్నచో తెల్పుకోనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

జగ్గవరపు సురేష్‌కుమార్ రెడ్డి
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 9441606789

పురపాలక సంఘ కార్యాలయం-జంగారెడ్డిగూడెం

ఆర్.ఓ.సి.నెం-20/2025/ఇ1 **తేది.22.12.2025**

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఈ దిగువ తెలిపన పనులు చేపట్టుటకు ఇ-ప్రొక్యూరుమెంటు ద్వారా టెండరులు పిలువబడుచున్నది.

వ.నెం.	పని వివరము	పనుల సంఖ్య	ECV(రూ.లక్షలలో)
1.	జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల నందు 1) సిసి రోడ్లు & డ్రైన్లు నిర్మాణం (ఒక పని), 2) బిటి రోడ్డు నిర్మాణం 3) మున్సిపల్ పార్క్ అభివృద్ధి చేయుట (సాధారణ నిధుల)	03	49.00

సంబంధిత వివరములు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైటు నందు ది.23.12.2025వ తేది ఉదయం గం.10.00ల నుండి చూడవచ్చును. ఇతర వివరములకు మున్సిపాలిటీ కార్యాలయము, ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- కమీషనర్
జంగారెడ్డిగూడెం మున్సిపాలిటి